క్లుప్తంగా

నేడు బీఆర్‌ఎస్ కార్యాలయం ప్రారంభం

శంకర్‌పల్లి: శంకర్‌పల్లిలో బీఆర్‌ఎస్ కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించనున్నట్లు మండల అధ్యక్షుడు కావలి గోపాల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్ల నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జి పి. కార్తీక్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్యలు రానున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

శంకర్‌పల్లి: మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు శంకర్‌పల్లి మండల విద్యుత్ శాఖ ఏఈ ప్రదీప్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 33కేవీ పర్వేద సబ్‌స్టేషన్ పరిధిలోని పర్వేద, చందిప్ప, మాసానిగూడ, లచిచ్రెడ్డిగూడ, అంతప్పగూడ, సంకేపల్లి, ఏర్వగూడ గ్రామాల్లో ఆదివారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తారని ఆయన పేర్కొన్నారు.

హనుమాన్ దేవాలయంలో పల్లకీ సేవ



అన్నదానం చేస్తున్న శివకుమార్

షాద్‌నగర్: పట్టణ శివారులోని చౌడమ్మగుట్ట హనుమాన్ దేవాలయంలో శనివారం ఘనంగా పల్లకీ సేవ నిర్వహించారు. భక్తులు ఆటపాటలతో, భజనలతో స్వామి వారిని ఊరేగించారు. ఆలయ అర్చకులు రఘుపతిరావు, రాఘవేంద్రచారి, కృష్ణ, ప్రమోద్, సునీల్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు శ్రీలక్ష్మీ స్టీల్ అండ్ సిమెంట్ దుకాణ యజమాని శివకుమార్ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు లతా శ్రీశైలంగౌడ్, ఆగీరు శేఖర్, ఆగీరు మారుతి, యంసాని నర్సింలు, అన్నారం రఘుగౌడ్, రమేశ్, రఘునందన్‌రెడ్డి, లక్ష్మణ్, కిషన్ నాయక్, రాఘవేందర్, నారాయణ, యామ శ్రీనివాస్, కృష్ణయ్య, లక్ష్మీకాంత్, శంకర్‌గౌడ్, పద్మా వెంకటేశ్, గోరియా నాయక్, బచ్చన్న, సత్తయ్య, శ్రీనివాస్, రమేశ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల సభకు తరలిన నేతలు



సభకు తరలివెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

మొయినాబాద్: ఎన్నికల ప్రచారంలో భాగంగా చేవెళ్లలో కాంగ్రెస్ ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌కు ఆ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత బట్టి విక్రమార్క తదితరులు హాజరైన కార్నర్ మీటింగ్‌కు మొయినాబాద్ మండలంలోని అన్ని గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలివెళ్లారు. పీసీసీ కార్యవర్గ సభ్యుడు షాబాద్ దర్శన్, మండల అధ్యక్షుడు మాణయ్య, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, ఎంపీటీసీ రాంరెడ్డి, కేబుల్ రాజు, రవీందర్‌రెడ్డి, జంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు అధికారం ఖాయం

- చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్
- లక్ష్మరావుగూడలో బీఆర్‌ఎస్ నాయకులు పార్టీలో చేరిక
- హస్తంతోనే అన్ని వర్గాలకు న్యాయం
- పోతుగల్ గ్రామంలో క్రైస్తవ మత పెద్దలతో ప్రార్థనలు



చేవెళ్ల: ఊరేళ్లకు చెందిన కార్యకర్తలకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న భీంభరత్

చేవెళ్ల: కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్, చేవెళ్ల నియోజకవర్గం సమన్వయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డిలు అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్ సమక్షంలో శనివారం ఊరేళ్ల గ్రామానికి చెందిన ఇతర పార్టీలకు చెందిన కార్యకర్తలు గ్రామ కమిటీ అధ్యక్షుడు సునుగంటి కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా భీంభరత్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి విస్తోందని చెప్పారు. అందుకే ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరుతున్నారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేస్తే పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అవినీతి, అక్రమ పాలన చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలుచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్‌లు దేవర వెంకట్‌రెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డి, ఆగిరెడ్డి, టేకులపల్లి శ్రీనివాస్, నారాయణ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

షాబాద్‌లో..

షాబాద్: కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని చేవెళ్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్ అన్నారు. షాబాద్ మండల పరిధిలోని నాగర్‌గూడలో లక్ష్మరావుగూడ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు బంటు కిష్టయ్య, అనంతరెడ్డి, రామకృష్ణారెడ్డి, నర్సింహారెడ్డిలు పీసీసీ రాష్ట్ర పీసరి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రవేశ పెట్టిన ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించాలన్నారు. చేవెళ్లలో ఎగిరేది కాంగ్రెస్ జెండానేనన్నారు. ఈ కార్యక్రమంలో మాణిక్యంగౌడ్, ఆసిగారి బాల్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

అవినీతి బీజేపీ, బీఆర్‌ఎస్‌లను ఓడించాలి...

అవినీతి, నియంతృత్వ దోపిడీ పాలన చేస్తున్న బీఆర్‌ఎస్, బీజేపీలను ఓడించాలని చేవెళ్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్ పేర్కొన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని పోతుగల్ గ్రామంలో క్రైస్తవ మత పెద్దలు, చర్చి పాస్టర్ ఆంజనేయులుతో కలిసి సర్వమత ప్రార్థనలు చేశారు. అనంతరం గ్రామంలో పీసీసీ రాష్ట్ర కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి, డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పామెన భార్గవ్‌రామ్, చేవెళ్ల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెంటారెడ్డిలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవీందర్‌నాయక్, పామెన నర్సింహులు, కావలి శ్రీను, అశ్వక్‌అలీ, దయానంద్‌గౌడ్, యాదయ్య, కిషన్‌నాయక్, మాణిక్యంగౌడ్, కృష్ణ పాల్గొన్నారు.



షాబాద్: పోతుగల్‌లో క్రైస్తవ మత పెద్దలతో సర్వమత ప్రార్థన చేస్తున్న భీంభరత్

పాటల ఆడియో ఆవిష్కరణ..

షాబాద్ నుంచి చేవెళ్ల విజయభేరి సభకు పీసీసీ రాష్ట్ర కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి, డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పామెన భార్గవ్‌రామ్, మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెంటారెడ్డి, మహిళ అధ్యక్షురాలు అశ్వనిలతో కలిసి వాహనాలలో తరలివెళ్లారు. అనంతరం భీంభరత్ సతీమణి పామెన జ్యోతి ఆయన పాటల ఆడియోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు విసిగుచెందారన్నారు. రానున్న ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. బీసీ సెల్ అధ్యక్షుడు గడ్డం చంద్రయ్య, ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, అశోక్, మల్లేశ్, శ్రీరాంరెడ్డి, పాల్గొన్నారు.

జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు

షాబాద్: జీవాలకు వ్యాధి నిరోధక (పీపీఆర్) టీకాలను ఈ నెల 30 నుంచి నవంబర్ 22వ తేదీ వరకు వేయనున్నట్లు రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మేకలకు, గొర్రెలకు పారుడు వ్యాధి సోకితే జీవాలు పుర్ర్ కొట్టడం, మూతులకు పుండ్లు ఏర్పడి జ్వరం వచ్చి చనిపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ వ్యాధి నివారణకు కేంద్ర ప్రభుత్వం ముందస్తు టీకాలు ఇస్తుందన్నారు. టీకాలు వేయించిన తర్వాత జీవాలకు మూడు సంవత్సరాల వరకు వ్యాధి వ్యాపించకుండా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమం పారదర్శకంగా ఉండేందుకు టీకా వేసిన ప్రతీ గొర్రె, మేకలకు ట్యాగ్ వేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. జీవాలు పెంచుతున్న రైతులు తప్పనిసరిగా ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పర్యావరణాన్ని కాపాడండి



మొక్కలు నాటుతున్న బాలవికాస్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు

- పర్వేద జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిద్దేశ్వర్

శంకర్‌పల్లి: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని పర్వేద జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిద్దేశ్వర్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని పర్వేద జిల్లా పరిషత్ ఆవరణలో బాలవికాస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎఫ్ఏఐ సహకారంతో పండ్ల మొక్కలను నాటారు. ప్రతిఒక్కరూ ఇంటి పెరట్లో, రైతులు తమ పొలాల వద్ద పండ్ల మొక్కలను నాటి కుటుంబ ఖర్చును తగ్గించుకోవచ్చన్నారు. తిరుపతి, శ్రీరాం, రహమాన్, రాజ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

కుటుంబ పాలనకు స్థానం లేదు

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: రాష్ట్రంలో కుటుంబ పాలనకు ఇక నుంచి స్థానం లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీని సీఎం చేస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రకటించిడం అభినందనీయమన్నారు. శనివారం షాద్‌నగర్ పట్టణంలో బీజేపీ నేతలు ప్రధాని మోదీ చిత్ర పటానికి పాలాభిషేకం చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ బీసీలకు రాజ్యాధికారం రావాలంటే రాబోవు ఎన్నికల్లో బీజేపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. తెలంగాణలో కాంగ్రెస్‌కి 11 సార్లు అధికారం ఇస్తే బడుగు బలహీన వర్గాలకు చేసిందేమి లేదన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైతే దళితుడిని సీఎం చేస్తానని హామీ ఇచ్చిన కేసీఆర్ గెలిచిన అనంతరం మాటమార్చారన్నారు. అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు మోసం చేశాయన్నారు. కేంద్ర కేబినెట్‌లో ప్రధాని 27 మంది బడుగు బలహీన వర్గాలకు స్థానం కల్పించారన్నారు. నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రధాని అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను చేపడుతున్నారని గుర్తు చేశారు. పార్టీ కన్వీనర్ డాక్టర్ విజయ్‌కుమార్, అందెబాబయ్య, దేపల్లి అశోక్‌గౌడ్, వంశీకృష్ణ, చెట్ల వెంకటేశ్, ప్యాట అశోక్, మల్చలం మురళి, శ్రీనివాస్‌చారి, హరీశ్, బాల్‌రాజ్, శ్రావణ్, సాయిగౌడ్, శ్యాంసుందర్, నరేశ్, రవి, కాసోజు శివకుమార్ పాల్గొన్నారు.



స్వీట్లు తినిపించుకుంటున్న బీజేపీ

నిరుపేద కుటుంబానికి అండగా ఉంటాం

- వాసవిక్లబ్ అధ్యక్షుడు గార్ల పాటినవీన్‌కుమార్

షాద్‌నగర్‌రూరల్: నిరుపేద కుటుంబానికి వాసవిక్లబ్, ఆర్యవైశ్య సంఘం అండగా నిలిచింది. షాబాద్ మండలం హైతాబాద్ గ్రామానికి చెందిన ఉప్పలజ్యోతి, శేఖర్‌గుప్తా దంపతులది నిరుపేద కుటుంబం. వారి కూతురు పూజిత వివాహానికి వాసవిక్లబ్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు అండగా నిలిచారు. ఈ సందర్భంగా వాసవిక్లబ్ అధ్యక్షుడు గార్లపాటినవీన్‌కుమార్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో శేఖర్‌గుప్తా కుటుంబానికి రూ.1,01,000లు చెక్కును అందజేశారు. అనంతరం గార్లపాటినవీన్‌కుమార్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సేవాదృక్పథాన్ని అలవర్చుకొని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ, యంసాని శ్రీనివాస్, మలిపెద్ది శ్రీనివాస్‌గుప్తా, పెద్దిరాంమోహన్, పోల శశిధర్, భానూరి రాంమోహన్, ఉప్పల శ్రీనివాస్, కల్వ నరేందర్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

అత్యధిక మెజార్టీ లక్ష్యం

- మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

కొత్తూరు: అసెంబ్లీ ఎన్నికల్లో షాద్‌నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ కచ్చితంగా అత్యధిక మెజార్టీతో గెలుస్తుందని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెంజర్ల గ్రామంలో శనివారం మాజీ జెడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పార్టీ అభ్యర్థి వీర్లపల్లి శంకర్‌తో కలిసి పాల్గొన్నారు. బీఆర్ఎస్‌కి చెందిన స్థానిక సర్పంచ్ మామిడి వసుంధరమ్మ, ఎంపీటీసీ అంజమ్మతో పాటు వార్డు సభ్యులు, సుమారు 500 మంది పార్టీలో చేరారు. వారికి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ అభ్యర్థి శంకర్‌లు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ షాద్‌నగర్‌కు ప్రస్తుతం ముగ్గురు ఎమ్మెల్యేలు కొనసాగుతున్నట్లు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేను ఉద్దేశించి అన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో నియోజకవర్గంలో పెద్దగా జరిగిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. రాష్ట్రంలో పూర్తిగా ప్రజా వ్యతిరేక పాలన సాగుతుందన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ అధికారంలోకి రావాలని బలంగా కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో హరినాథ్‌రెడ్డి, సుదర్శన్‌గౌడ్, విశాల, సిద్ధార్థరెడ్డి, జమ్రుద్‌ఖాన్, చంద్రపాల్‌రెడ్డి, కార్యకర్తలు, పాల్గొన్నారు.



కొత్తూరు: ఎంపీటీసీ, సర్పంచ్‌కు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే, శంకర్

గెలుపే లక్ష్యం..

మొయినాబాద్‌రూరల్: చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేసేందుకు అందరూ కృషి చేయాలని కాంగ్రెస్ నాయకులు బొలిగిద్ద సత్యనారాయణ, అప్సర్ ఆలీలు పేర్కొన్నారు. మండల పరిధిలోని తోల్‌కట్ట గ్రామంలో కాంగ్రెస్ కార్యాలయాన్ని గ్రామ అధ్యక్షుడు శంకరయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పవనాలు వీస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, బోడా జంగయ్య, శ్రీశైలం, అమిత్‌ఖాన్, షకీల్, శంకరయ్య, భాస్కర్, కృష్ణ, పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి

- జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేశ్

నందిగామ: తొమ్మిదేళ్లుగా రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేశ్ అన్నారు. మండల పరిధిలోని బండోనిగూడ, బండోనిగూడ తండా, మొదళ్లగూడ తదితర గ్రామాల్లో శనివారం జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేశ్ స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు చేయలేని అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిందన్నారు. రైతు బంధు, రైతు బీమా, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతు రుణమాఫీ తదితర సంక్షేమ పథకాలను అమలు చేసిందని ఆయన గుర్తు చేశారు. ఈ ఎన్నికలలో బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో అంజయ్య యాదవ్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మొత్కుల గూడ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ అశోక్, మాజీ చైర్మన్ విఠల్, సర్పంచ్ జెట్ట కుమార్, మాజీ సర్పంచ్ పట్వారీ శ్రవణ్ కుమార్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



బండోనిగూడలో ఎన్నికల ప్రచారంలో గణేశ్

మోసం చేసే వారికి అవకాశం ఇవ్వొద్దు



మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

- బీజేపీ సీనియర్ నేత విష్ణువర్ధన్‌రెడ్డి

కొత్తూరు: ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి అమలు చేయకుండా ప్రజలను మోసం చేసే అభ్యర్థులకు తిరిగి అవకాశం ఇవ్వొద్దని బీజేపీ సీనియర్ నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం పార్టీ నాయకులతో కలిసి మండలంలోని సిద్ధాపూర్, కొత్తూరు, ఎస్‌బీపల్లి, కొడిచర్ల గ్రామాల్లో పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొన్ని పార్టీలకు చెందిన నాయకులు కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే గ్రామాల్లో పర్యటించి ఉచిత హామీలు ఇస్తుంటారన్నారు. తీరా అధికారంలోకి రాగానే గ్రామాలను మర్చిపోయి ప్రజలకు అందుబాటులో ఉండరన్నారు. అలాంటి వారిని నమొద్దని హితవు పలికారు. నిత్యం ప్రజాక్షేత్రంలో ఉంటూ సమస్యలను పరిష్కరించే నాయకులకే ప్రజలు ఓటు వేయాలని వివరించారు. పాలమూరు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవలు అందిస్తున్న తనకు ఇసారి షాద్‌నగర్ అసెంబ్లీ అభ్యర్థిగా అవకావం ఇచ్చి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మోహన్‌సింగ్, ప్రదీప్, నాగరాజుచారి, నర్సింహ్మాగౌడ్, వెంకట్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, రమేశ్, నర్సింహ్మా, బాబునాయక్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

టికెట్ విషయంలో పునరాలోచన చేయాలి

- డీకే శివకుమార్‌ను కోరిన రాచమల్ల సిద్దేశ్వర్

మొయినాబాద్: కాంగ్రెస్ చేవెళ్ల టికెట్ విషయంలో పునరాలోచన చేయాలని పీసీసీ సభ్యుడు రాచమల్ల సిద్దేశ్వర్ కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కోరారు. శనివారం ఎన్నికల ప్రచారంలో చేపట్టిన బస్సు యాత్రలో పాల్గొన్న శివకుమార్‌ను రాచమల్ల సిద్దేశ్వర్ మర్యాదపూర్వకంగా కలిశారు. టికెట్ కేటాయింపులో పార్టీ అదిష్టానం పునరాలోచన చేయాలని పేర్కొన్నారు. పార్టీకోసం పనిచేసినవారికి న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాలని సిద్దేశ్వర్ కోరారు.



డీకే శివకుమార్‌ను సన్మానిస్తున్న రాచమల్ల సిద్దేశ్వర్

ఘనంగా సత్కారం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టులో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న లక్ష్మీనర్సింహారెడ్డికి ఘనంగా వీడ్కోలు పలికారు. ఆమనగల్లు పట్టణంలో శనివారం జరిగిన కార్యక్రమంలో నర్సింహారెడ్డిని స్థానిక జడ్జీ స్వరూప, పలువురు న్యాయవాదులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు లక్ష్మణశర్మ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జాలను నిరూపించండి

- బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి
- మండల కేంద్రంలో కార్యకర్తలతో సమావేశం

కేశంపేట: ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌తో పాటు వారి కుమారులు నియోజకవర్గంలో ఎక్కడైనా భూకబ్జాలకు పాల్పడినట్లనిపిస్తే నిరూపించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్‌కి చెందిన ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులతో మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వర్కాల లక్ష్మీనారాయణగౌడ్‌తో పాటు మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డిలు మాట్లాడారు. ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అవినీతికి ఆస్కారం లేకుండా పాలన చేశారన్నారు. నాయకులు, కార్యకర్తలు కొందరు వారి స్వార్థం కోసం పార్టీలు మారిన తరువాత ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. ఎమ్మెల్యేతో పాటు ఎంపీపీ రవీందర్ యాదవ్‌పై చేసిన ఆరోపణలను నిరూపిస్తామంటే సమయం, స్థలం తెలపాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గంగ్ర జగదీశ్వర్‌గౌడ్, అంజిరెడ్డి, జమాల్‌ఖాన్, తలసాని వెంకట్‌రెడ్డి, నారాయణరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నవీన్‌కుమార్, జగన్‌నాయక్, శేఖర్‌రెడ్డి, వెంకటయ్య, శ్రీశైలంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

నమ్మి ఓటేస్తే కష్టాలు తప్పవు

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్‌రూరల్: ఎన్నికల్లో కాంగ్రెస్‌ని నమ్మి ఓటేస్తే కష్టాలు తప్పవని బీఆర్‌ఎస్ అభ్యర్థి అంజయ్యయాదవ్ అన్నారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మేళ్లగూడ, వెంకన్నగూడ, కొండన్నగూడ, బుచ్చిగూడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో వివిధ పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన వారికి అంజయ్యయాదవ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అంజయ్యయాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో పేదల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసిన మహనీయుడు సీఎం కేసీఆర్ అని అన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేసిన సీఎం కేసీఆర్‌కు మరోసారి పట్టం కట్టేందుకు బీఆర్‌ఎస్‌ని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో సంక్షేమ పథకాలు ఎందుకు అమలు చేయడంలేదని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీల మాయ మాటలను నమ్మొద్దని, అభివృద్ధికోసం పరితపిస్తున్న బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని ఆయన కోరారు.

కాంగ్రెస్‌ను వీడి కారెక్కిన సర్పంచ్..

ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని నాగులపల్లి సర్పంచ్ నర్సింలు కాంగ్రెస్‌ని వీడి ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా అంజయ్యయాదవ్ పార్టీ కండువా కప్పి నర్సింలును పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ని నమ్మే పరిస్థితి లేదన్నారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సే బీఆర్‌ఎస్ ఎజెండా అని అన్నారు. ప్రజలందరు బీఆర్‌ఎస్‌వైపే ఉన్నారని, రానున్న ఎన్నికల్లో అధిక మెజార్టీతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ఈటగణేశ్, నారాయణరెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, పట్వారిశ్రవణ్, పాపయ్యయాదవ్, మిట్టునాయక్, రాంబల్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, రాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



గిరిజన మహిళతో మాట్లాడుతున్న అంజయ్య

ఆలయాలు మూసివేత

చేవెళ్ల: చంద్రగ్రహణం సందర్భంగా మండలంలోని ఆలయాలను పూజారులు మూసి వేశారు. శనివారం రాత్రికి చంద్రగ్రహణం ప్రారంభం కావడంతో చేవెళ్లలోని పలు ఆలయాలను పూజారులు మూసి వేశారు. చేవెళ్లలోని వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని పూజారి శ్రీపాదు, కొనగట్టు శివాలయాన్ని పూజారి సురేశ్ మూసి వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రగ్రహణం అర్ధరాత్రి ప్రారంభమవుతుందని వారు పేర్కొన్నారు.



శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని మూసి వేస్తున్న పూజారి శ్రీపాదు